క్లుప్తంగా

షటిల్ పోటీల్లో సంజయ్, అరవింద్ సత్తా



తెనాలి అర్బన్: మండలంలోని కొలకలూరులో కిస్బా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన అంతర్ జిల్లాల షటిల్ పోటీల్లో బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ పాఠశాల విద్యార్థులు ఎ.సంజయ్, ఎ.అరవింద్ (బాలుర డబుల్స్ విభాగంలో) ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. పాఠశాల ఆవరణలో గురువారం వీరికి స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ మెమెంటోలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంచార జాతుల మహిళలకు చీరల పంపిణీ



తెనాలి అర్బన్: వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కళాశాల ఎదురుగా చెట్ల కింద నివసిస్తున్న సంచార జాతుల పేద మహిళలు 42 మందికి చీరలు, నిత్యావసర వస్తువులు, దుప్పట్లను గురువారం ట్రిబల్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు రావూరి అంజలి మాట్లాడుతూ వెనుకబడిన జాతుల వారిని గుర్తించి వారికి ప్రతి వారం తమ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ రావూరి సురేష్, సభ్యులు పాల్గొన్నారు.

మహాత్మా ఆశ్రమంలో వృద్ధులకు దుప్పట్ల పంపిణీ




తెనాలి టౌన్: కొల్లావారి వీధిలోని మహాత్మా సేవా శాంతి ఆశ్రమంలో గురువారం పట్టణానికి చెందిన విన్నకోట కృష్ణమూర్తి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు విన్నకోట కిరణ్‌కుమార్, కాశిక లక్ష్మి దంపతులు వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. నాజరుపేటలోని మన ఇల్లు వృద్ధాశ్రమం, చెంచుపేటలోని శబరి వృద్ధాలయంలో వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పొడుగు పద్మావతి, నాగేశ్వరరావు, మణి మాల, వి.కృతయుగ్, దేవాన్స్‌బాబు, ఆశ్రమ నిర్వాహకులు కోటేశ్వరరావు, పాల్గొన్నారు.

జగనన్న గోరుముద్ద తనిఖీ



తెనాలి అర్బన్: జగనన్న గోరు ముద్దను ప్రతి విద్యార్థి తినేలా చూడాలని మండల విద్యాధికారి మేకల లక్ష్మీనారాయణ సూచించారు. మారీసుపేటలోని ఎన్‌సీఆర్ ఎన్‌ఎంహెచ్ స్కూల్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. మెనూను పరిశీలించి, దాని ప్రకారం విద్యార్థులకు భోజనం పెడుతున్నారా.. లేదా ? అనే దానిపై ఆరా తీశారు. అక్కడే భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి పోషక విలువలు ఉన్న ఆహారాన్ని పాఠశాలలో పెడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు బషీర్ అహ్మద్, సుధారాణి, రిసోర్స్ పర్సన్ శ్రీదేవి, పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెనాలి లాడ్జిలో నెల్లూరు వాసి మృతి



తెనాలి రూరల్: స్థానిక లాడ్జిలో నెల్లూరుకు చెందిన వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. 40 నుంచి 45 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి తెనాలి రైల్వే స్టేషన్ ఎదురు ఉన్న లాడ్జికి బుధవారం వచ్చాడు. పేరు కరీముల్లా అని, ఊరు నెల్లూరు అని చెప్పి మంచం అద్దెకు తీసుకున్నాడు. గురువారం మధ్యాహ్నం దానిపై మృతి చెంది ఉన్నాడు. మృతుడు నీలం రంగు జీన్సు ప్యాంటు, కాఫీ రంగు గళ్ల చొక్కా ధరించి ఉన్నాడు. సమాచారం అందుకున్న త్రీ టౌన్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు.

వ్యక్తి ఆత్మహత్య

మద్యం తాగవద్దని కుటుంబసభ్యులు పదే పదే చెబుతుండడంతో మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చినరావూరు రైస్ కాలనీకి చెందిన సారధి శరత్‌కుమార్(31) ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల అనారోగ్యానికి గురవడంతో వైద్యులు మద్యం తాగవద్దని సూచించారు. అప్పటి నుండి తల్లిదండ్రులు, భార్య మద్యం చెబుతున్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి గదిలోకి వెళ్లిన అతను చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం ఉదయం గమనించిన కుటుంబసభ్యులు పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- 19వ వార్డులో ముగిసిన గడప గడపకు మన ప్రభుత్వం



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి అర్బన్: పట్టణంలోని వ్యాపారులకు అండగా ఉండటంతో పాటు వారికి రక్షణను కల్పిస్తున్నామని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 19వ వార్డు షరాఫ్ బజార్ నుంచి గురువారం సాయంత్రం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ 19వ వార్డు నాయకులు పొత్తూరి వీరరాఘవయ్య, టెక్స్ బాల, చుండూరు సాయి ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేసి, వారి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ పట్టణంలోని పేద ఆర్యవైశ్యుల్ని అన్ని ప్రభుత్వాలు గతంలో నిర్లక్ష్యం చేశాయని ఆరోపించారు. తమ ప్రభుత్వం వచ్చిన తరువాత 1600మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చినట్లు చెప్పారు. 45మంది పేద ఆర్యవైశ్యులకు ఈబీసీ నేస్తం కింద రూ.6,75,000 బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. 19వ వార్డులో ఇప్పటి వరకు రూ.8కోట్ల సంక్షేమాన్ని అందించామని గుర్తు చేశారు. వ్యాపార కూడలి కావడం వల్ల రోడ్లు, కాల్వలు ఇరుకుగా ఉన్నాయని వాటికి త్వరలో మరమ్మతులు చేయనున్నట్లు చెప్పారు. వ్యాపారులు చెప్పిన ప్రతి గ్రీవెన్స్‌ను నమోదు చేసుకున్నామని, ప్రభుత్వం వార్డు అభివృద్ధి కోసం ఇచ్చే రూ.20లక్షలతో వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వీధి దీపాల్ని శనివారం సాయంత్రం లోపు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, కౌన్సిలర్లు షేక్ దుబాయ్‌బాబు, యాతాటి అనిల్, పేరం సంజీవరెడ్డి, మొగల్ అహ్మద్, వీర్లపాటి విజయలక్ష్మి,కో–ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభాని, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.ఆర్.కె. శర్మ, దేసు శ్రీనివాసరావు, ఏలూరి శేషగిరిరావు, కాకిదేవ సహాయం, కాళిదాసు వెంకటేశ్వరరావు, అక్కిదాసు కిరణ్‌కుమార్, కాళిదాసు సత్యం, షేక్ గఫూర్, కోలా వాసు, కఠారి హరీష్, సయ్యద్ దౌలాత్, భాస్కరుని శ్రీనివాసరావు, కావేటి ఈశ్వరరావు, సంకా చంద్రశేఖర్, భాస్కరుని లక్ష్మీనారాయణ, దేవరపల్లి నాగభూషణం, మల్లెబోయిన రాము, షేక్ మీరావలి, మద్దాలి శేషాచలం, గుంటూరు కృష్ణ, పోతవరపుల పురుషోత్తమశర్మ, వీరశెట్టి భాస్కర్, వంగాల మాధవ్, తాడిబోయిన రమేష్, అడుసుమల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

షాపుల నిర్వాహకులకు నియామక పత్రాల పంపిణీ

తెనాలి టౌన్: బుర్రిపాలెం రోడ్డులోని గాంధీ ఇర్విన్ పార్క్ రైతుబజార్‌లో షాపుల నిర్వాహకులకు గురువారం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నియామక పత్రాల్ని అందజేశారు. డ్వాక్రా మహిళలతో పాటు మరికొందరికి కలిపి కొత్తగా తొమ్మిది మందికి షాపులు కేటాయించినట్లు ఆయన తెలిపారు. అనంతరం రైతుబజార్‌లో కూరగాయల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు షాపుల ద్వారా కూరగాయల్ని విక్రయించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. నెలకు ఒక్కో షాపునకు రూ.8,500 అద్దె ప్రాతిపదికన కేటాయించినట్లు రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు దేసు శ్రీనివాసరావు, కౌన్సిలర్లు తోట రఘురామ్, పేరం సంజీవరెడ్డి, దుబాయ్‌బాబు, తాడిబోయిన రమేష్, పెచ్చింగ్ సుభాని, అక్కిదాసు కిరణ్‌కుమార్, కఠారి హరీష్, ఎరుకలపూడి సర్పంచ్ చందు శాంతికుమార్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి అర్బన్: అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రి ఖర్చులు భరించలేని ఓ పేద యువకుడికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.10లక్షలు ఆర్థికసాయం చేశారు. దానికి సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు. అమరావతి ప్లాట్స్‌లో కొంగల వరదానం నివసిస్తున్నాడు. అతడు అనారోగ్యంతో బాధపడుతూ వైద్యశాలలో ప్రాథమిక చికిత్స పొందాడు. వైద్యానికి రూ.10లక్షల దాకా ఖర్చు అవుతుందని వైద్యులు తెలపడం, అతనికి సంభవించిన వ్యాధి ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాకపోవడంతో వారు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను కలసి ఆదుకోవాలని కోరారు. ఆయన ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులతో మాట్లాడి సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.10లక్షలు మంజూరు చేసే విధంగా కృషి చేశారు. దానికి సంబంధించి చెక్కును తెనాలిలోని ఆయన కార్యాలయంలో గురువారం అందజేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే శివకుమార్‌కు వరదానం కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

వేమన పద్యాలు.. నిత్య సత్యాలు

ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు



పోటీల్లో విజేత కె.రత్నశ్రీకి నగదు బహుమతి

మోదుకూరు(తెనాలి): బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం చుండూరు మండల గ్రామం మోదుకూరులో ప్రజాకవి వేమన జయంతి ఉత్సవాల్ని గురువారం ఘనంగా నిర్వహించారు. 1929లో ఆరంభించిన వేమన జయంతి ఉత్సవాల నిర్వహణ వరుసగా 94వ సంవత్సరం జరుపుకోవడం, అదికూడా ప్రభుత్వ జీవో ప్రకారం రాష్ట్రంలో ఇదేరోజు అధికారికంగా వేమన జయంతి ఉత్సవాలు జరుగుతున్న రోజు కావడం విశేషం. వేమన జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలోని వేమన సాహిత్య వికాస పరిషత్ భవనంలో సాయంత్రం జరిగిన సభకు రాష్ట్ర చరిత్ర కాంగ్రెస్ అధ్యక్షుడు, చరిత్ర అధ్యాపకుడు మొవ్వ శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు మాట్లాడుతూ 2023లోనూ వేమన ఇప్పటికీ మన ఆలోచనల్లో ఉన్నారు? ఎందుకు ఆయన్ను ప్రజాకవిగా ఇప్పటికీ పిలుస్తున్నారు? అనేది ప్రధానంగా చెప్పారు. సమాజానికి కేంద్ర బిందువైన మనిషి, మానవ సంబంధాలు, కుటుంబ బాంధవ్యాలు, సమాజం, కులం, మూఢనమ్మకాల గురించి వేమన చెప్పారని వివరించారు. కులం, మూఢ విశ్వాసాలు కొనసాగడం, కుటుంబ బాంధవ్యాలు పలచబడటం, మానవ సంబంధాలు తగ్గిపోతున్న నేటి సమాజంలోనూ వేమన పద్యాలు ఇప్పటికీ రిలవెంట్ అని అభిప్రాయపడ్డారు. వేమన కులం, ప్రాంతం గురించిన చర్చ అనవసరమనీ, ఆయన సాహిత్యం, ఆలోచనలతో ముందుకెళ్లాలని సూచించారు. వేమన సాహిత్యంలోని ముఖ్యమైన వంద పద్యాలను ఎంపికచేసి లక్షకు పైగా కాపీలను ముద్రించి పాఠశాలల విద్యార్థులకు అందించాలనే నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో తొమ్మిది దశాబ్దాలకు పైగా వేమన ఆలోచనలను ప్రచారం చేస్తున్న నిర్వాహక కమిటీని అభినందించారు. లయోలా కాలేజి ప్రొఫెసర్ పుచ్చా శ్రీనివాసశాస్త్రి మాట్లాడుతూ సమాజంలో ఎన్నో సమస్యలకు వేమన పద్యాలు పరిష్కారాలుగా చెప్పారు. వేమన సాహిత్యంలో అన్నీ ఉన్నాయని సోషలిస్టు ఉద్యమకారుడు మోదుగుల పాపిరెడ్డి అన్నారు. సభాధ్యక్షుడు మొవ్వా శ్రీనివాసరెడ్డి తన ప్రసంగంలో రాష్ట్ర ప్రభుత్వ తాజా నిర్ణయంతో తెలుగుజాతి ఉన్నంతవరకు వేమన పద్యాలు ప్రజల నాల్కలపై నడయాడుతూనే ఉంటాయన్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు తియ్యగూర సీతారామిరెడ్డి అనువదించిన బౌద్ధ సాహిత్య పుస్తకాన్ని ఎమ్మెల్సీ లక్ష్మణరావు ఆవిష్కరించారు. చుండూరు మండల వైస్ ఎంపీపీ ఆళ్ల వెంకటరమణారెడ్డి, ముళ్లపూడి శరత్, మాజీ సర్పంచ్ మొవ్వా సాంబిరెడ్డి మాట్లాడారు. ఉదయం గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని విద్యార్థులకు వేమన పద్య పఠనంపై పోటీల్ని ఇమడాబత్తుని నాగేశ్వరరావు నేతృత్వంలో నిర్వహించారు. మొవ్వా సుబ్బారావు, ఆళ్ల నాగేశ్వరరావు, మండేపూడి పోలేశ్వరరావు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ పోటీల్లో కె.రత్నశ్రీ (మండూరు) ప్రథమ బహుమతిని గెలుచుకోగా, శ్వేత (మోదుకూరు) ద్వితీయ, టి.జాహ్నవి (పొన్నూరు) తృతీయ బహుమతిని దక్కించుకున్నారు. వీరితోపాటు మరో 10 మందికి కన్సోలేషను బహుమతులను ప్రదానం చేశారు. మధ్యాహ్నం జరిగిన సభలో వీరికి నగదు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమాన్ని రాధాకృష్ణారెడ్డి పర్యవేక్షించారు.

ఒక టైంలో యాక్టింగ్ వద్దనుకున్నా!

బుల్లి తెర హీరో మహేష్‌బాబు కాళిదాసు



సహ నటితో మహేష్‌బాబు కాళిదాసు

తెనాలి: బుల్లితెర మాధ్యమం డైలీ సీరియల్స్, టెలీ ఫిలింలు, కామెడీ స్కిట్స్, పండగ ధమాకాలు నటనపై వ్యామోహం కలిగిన ఎందరికో చక్కని వేదికలు. ఇందులో ఆసక్తి, అభిరుచి కలిగిన ఔత్సాహికులు తమ కలల్ని నిజం చేసుకుంటున్నారు. తెనాలికి చెందిన కాళిదాసు మహేష్‌బాబు ఆ కోవలోకే వస్తారు. 'మనసిచ్చి చూడు'లో ఆదిగా మూడేళ్ల పాటు టీవీ ప్రేక్షకుల్ని అలరించి, 'ఉత్తమ నటుడు'గా నిరూపించుకున్నారు. మళ్లీ ఇప్పుడు 'శుభస్య శీఘ్రం' అంటూ ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. సంక్రాంతికి సొంతూరు వచ్చిన మహేష్‌బాబు 'సాక్షి'తో పంచుకున్న ఆ విశేషాలు ఆయన మాటల్లోనే...

ఒక్క అవకాశం అన్నట్టుగా...మనసిచ్చి చూడు డైలీ సీరియల్ నా లైఫ్‌కో టర్నింగ్ పాయింట్. ప్రేక్షకులు రిసీవ్ చేసుకుంటారన్న నమ్మకాన్ని నిజం చేసింది. ఆది క్యారెక్టర్ అంతలా గుర్తింపును తీసుకొచ్చింది. నిన్న మార్కెట్ సెంటర్లో నాన్నతో కలిసి వెళుతుంటే, 'ఆది' పేరుతోనే పలకరించటం మధురానుభూతిని కలిగించింది. నేను నటిస్తున్న కొత్త సీరియల్ 'శుభస్య శ్రీఘ్రం' ఈనెల 23 నుంచి జీ తెలుగులో ప్రారంభం కానుంది. టీవీ రంగంలోకి రావటం అంత ఈజీగా జరగలేదు. ఈ ఫీల్డులోకి రావాలనే ఆలోచన మొదట్లో లేదు. మహేశ్‌బాబు ఫ్యాన్‌ను. సినిమాపై క్రేజ్ ఉండేది. బీటెక్ పూర్తిచేశాక ఏం చేయాలనే సందిగ్ధంలో ఉన్నపుడు సినిమానే ఎంచుకున్నాను. రెండు మూడు సినిమాల్లో అవకాశాలు వచ్చాయి...దురదృష్టవశాత్తు వాటి నిర్మాణం ఆగిపోయింది.. రెండేళ్లపాటు అవకాశాలు రాలేదు. చివరకు యాడ్స్ దర్శకత్వం చేసేందుకని మయన్మార్ వెళ్లాను. సెలవులకు ఇండియా వచ్చినపుడు, అనుకోకుండా స్టార్ మా నుంచి ఆడిషనుకు పిలిచారు. అలా సెలక్టయ్యాను. మూడేళ్ల క్రితం దీపావళి పండక్కి ఇంటికొచ్చినపుడు, అప్పుడే మనసిచ్చిచూడు ప్రోమో రిలీజైంది. అది చూసిన నన్ను గుర్తుపట్టిన మా పక్కింటివారు చెప్పేదాకా మా ఇంట్లో తెలీదు. చూశాక సంతోషంతో అభినందించారు. మా పెదతాతయ్య కాళిదాసు కోటేశ్వరరావు. సుప్రసిద్ధ రంగస్థల నటుడు. తెనాలి పట్టణ రంగస్థల కళాకారుల సంఘం వ్యవస్థాపకుడు. ఆయన్ను నేను చూడలేదు. ఆయన నటించిన రెండు సినిమాలు చూడగలిగాను. ఆయన జీవిత చరిత్ర చదివాను. ఆయన జీన్స్ నాకొచ్చాయేమో..దీనికితోడు ప్రిన్స్ మహేశ్‌బాబు ఫ్యాన్‌ని కదా...అలా నటనపై అభిరుచి వచ్చి ఉండొచ్చు. ఇప్పుడు నటన నా ప్యాషన్.

నేడు 20వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం

తెనాలి అర్బన్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం 20వ వార్డు షరాఫ్ బజార్‌లోని పద్మశాలీ చేనేత సొసైటీ కార్యాలయం నుంచి సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నేతృత్వంలో జరిగే కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

కొల్లిపర: మండలంలో శుక్రవారం నుంచి 24వ తేదీ వరకు ఆధార్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పి.శ్రీనివాసులు తెలిపారు. ఆయన గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడారు. శుక్రవారం దావులూరు, పిడపర్రు, అన్నవరం, చివలూరు, 21న చక్రాయపాలెం, పిడపర్రు, బొమ్మువానిపాలెం, చివలూరు, 23న చక్రాయపాలెం, మున్నంగి, బొమ్మువానిపాలెం, అత్తోట, 24న అత్తోట, వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర గ్రామాల సచివాలయాలు, పాఠశాలల్లో ఆధార్ సెంటర్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆధార్ కార్డులో తప్పులు, బయోమెట్రిక్ వంటి సమస్యలున్న మండల ప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.నాంచారయ్య, ఈవోపీఆర్డీ సమతావాణి పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా

తెనాలి టౌన్: కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరుతూ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట గురువారం సీఐటీయు నాయకుల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయు పట్టణ గౌరవాధ్యక్షుడు షేక్ హుస్సేన్‌వలీ మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం పెంచాలని కోరారు. ఈ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఎ.వి.ఎన్. కుమారి, కె.జ్యోతి, వరలక్ష్మి, హైమావతి, శివకుమారి, శివనాగమల్లేశ్వరి, హేమలత, విజయలక్ష్మి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

తెనాలి రూరల్: రైల్లో నుంచి జారి పడి తీవ్రంగా గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సుమారు 35 నుండి 40 ఏళ్ల మధ్య వయసున్న గుర్తు తెలియని వ్యక్తి ఈ నెల 16వ తేదీన కొలకలూరు రైల్వే స్టేషన్ సమీపంలో రైలు నుంచి జారి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి 108కు సమాచారమివ్వగా, తెనాలి వైద్యశాలకు తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు వైద్యశాలకు పంపగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు.

సాంఘిక నాటక కళాకారుడు బాలస్వామికి సన్మానం



తెనాలి అర్బన్: నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో గురువారం 'సింహం నవ్వింది' చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. శుక్రవారం 'సామ్రాట్ అశోక' చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రముఖ సాంఘిక నాటక కళాకారుడు తుంగా బాలస్వామిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శుద్దపల్లి శివసత్యనారాయణ, శుద్దపల్లి రామయ్య, శుద్దపల్లి కోటేశ్వరరావు, ముత్తే కృష్ణారావు, ముత్తే వెంకటేశ్వరరావు, చెరుకుమల్లి సింగారావు, ఉయ్యూరి ఉమామహేశ్వరరెడ్డి, బాలసుందర్, కేసన కోటేశ్వరరావు, పెమ్మసాని పోతురాజు, దేవరపల్లి భవాని, అయినాల మల్లేశ్వరరావు, ఈదర శ్రీనివాసరావు, ఎన్‌టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, కొండమూది రమేష్, తుంగా సుబ్బారావు, ప్రసాద్, పెద్ద శవరయ్య, చిన్న శవరయ్య, నాగరాజు, శంకర్, రవి, నల్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎల్ఐసీ ప్రైవేటీకరణ నిలిపివేయాలి

ఉద్యోగ సంఘ నాయకుల డిమాండ్



ప్రతిజ్ఞ చేస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు

తెనాలి అర్బన్: లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ)కు ఎంతో చరిత్ర ఉందని, దాన్ని ప్రైవేటు పరం చేయడాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని ప్రముఖ వైద్యుడు కన్నెగంటి శ్రీనివాసరావు, ప్రముఖ విద్యావేత్త జొన్నాదుల నరసింహారావు డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేసన్ పిలుపు మేరకు కొత్తపేటలోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద గురువారం ఇన్సూరెన్స్ జాతీయకరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన వారు మాట్లాడుతూ 1956 జనవరి 19న ఆనాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, ఆర్థికమంత్రి చింతామణి దేసుముఖ్ 245 ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీల్ని జాతీయ చేసి లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాగా ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వ సొమ్ము ప్రజలకే వినియోగించాలని, పాలసీదారులకు మంచి సరీ్వసు అందించాలనే లక్ష్యాలతో ఎల్ఐసీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 67 సంవత్సరాలుగా ఎల్ఐసీ తన లక్ష్యాల్ని నేరవేరుస్తూ భారతదేశ ఆర్థికాభివృద్ధిలో ప్రముఖ పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. 2021–22 ఆర్థిక సంవత్సరంలో రూ.4,27,219 కోట్ల ఆదాయాన్ని సమకూర్చిందని వివరించారు. ఎల్ఐసీని జాతీయం చేసిన సమయంలో ప్రభుత్వం పెట్టిన రూ.ఐదు కోట్ల పెట్టుబడికి ప్రతిఫలంగా ఇప్పటి వరకు రూ.26,600 కోట్లు డివిడెంట్‌గా కేంద్రానికి చెల్లించిదని వెల్లడించారు.ఎల్ఐసీని ప్రభుత్వ రంగసంస్థగా కొనిసాగించాలని కోరారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ మచిలీపట్నం డివిజన్ ఉపాధ్యక్షుడు వేదాంతం ఫణీంద్ర, తెనాలి అధ్యక్ష కార్యదర్శులు తూనుగుంట్ల సురేష్, డి.వి.సుబ్బారావు, ఎల్ఐసీ డెవలెప్‌మెంట్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు బి.పూర్ణనారాయణ, రమేష్, ఏజెంట్ అసోసియేషన్ నాయకులు బి.పీటర్‌పాల్, డి.వెంకటేశ్వరరావు, ఎల్ఐసీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజలకు ఇబ్బంది కలుగుతోందని పునరుద్ధరణ



కార్యాలయం బయట విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ రవిబాబు, సిబ్బంది

తెనాలి రూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి విద్యుత్ సరఫరాను ఆ శాఖ అధికారులు నిలిపివేశారు. బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో గురువారం ఫీజులు తొలగించేశారు. దీంతో కంప్యూటర్లు, లైట్లు పని చేయక సేవలకు ఆటంకం ఏర్పడింది. కార్యాలయం వద్ద ప్రజలు ఎదురు చూస్తుండటంతో వారికి ఇబ్బంది లేకుండా తహసీల్దార్ కె. రవిబాబు ఆరుబయట బల్ల వేయించి విధులు నిర్వహించారు. కొందరు సిబ్బంది ల్యాప్‌టాప్‌ల ద్వారా పని చేశారు. రూ. 36 లక్షల విద్యుత్ బకాయి ఉందని తహసీల్దార్ తెలిపారు. ఆ తర్వాత ప్రజలకు ఇబ్బంది కలుగుతోందని తెలుసుకున్న రెవెన్యూ, విద్యుత్ ఉన్నతాధికారులు సరఫరాను పునరుద్ధరించారు. బకాయిల్ని త్వరలో చెల్లించేలా చూడాలని విద్యుత్ అధికారులు తహసీల్దార్ రవిబాబును కోరారు.

టెక్స్‌టైల్ మిల్స్ సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీ అప్పిరెడ్డి



అప్పిరెడ్డిని సన్మానిస్తున్న అసోసియేషన్ నేతలు

నెహ్రూనగర్: టెక్స్‌టైల్ మిల్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో గురువారం ఏపీ టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్ సమావేశం చైర్మన్ లంక రఘురామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ఆరు నెలలుగా స్పిన్నింగ్ పరిశ్రమ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటుందన్నారు. ముఖ్యంగా విద్యుత్తు సబ్సిడీ బకాయిలపై ప్రభుత్వంతో చర్చించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విన్నవించారు. అసోసియేషన్ సమస్యల్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని అప్పిరెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ వైస్ చైర్మన్లు సామినేని కోటేశ్వరరావు, ఎం. సత్యనారాయణ, కోటిరావు, ప్రసాద్ చౌదరి నాయకులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యత తప్పనిసరి



అన్నవరంలో రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసులు

అన్నవరం(కొల్లిపర): సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలని ఎంపీడీవో పి.శ్రీనివాసులు కాంట్రాక్టర్‌కు సూచించారు. మండలంలోని అన్నవరంలో గురువారం రూ. 20లక్షలతో నిర్మిస్తున్న నాలుగు సీసీ రోడ్ల నిర్మాణాల్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్మాణ పనుల్ని వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌కు, సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ సుబ్బారావు పాల్గొన్నారు.

పథకాలు లబ్ధిదారులకు చేరాలి

ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి చేరాలని ఎంపీడీవో పి.శ్రీనివాసులు సూచించారు. మండలంలోని పాతబొమ్మువానిపాలెం గ్రామ సచివాలయాన్ని గురువారం ఆయన హౌసింగ్ ఏఈ సుబ్బారావుతో కలసి తనిఖీ చేశారు.రికార్డులు, అమలు చేస్తున్న చార్ట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సమస్యలపై సచివాలయం వచ్చిన వారితో మర్యాదతో వ్యవహరించాలని సూచించారు. అర్హులైన వారికి పింఛన్లు అందకపోతే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. గ్రామంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కార్యదర్శులకు చెప్పారు. జగనన్నకాలనీలో లబ్ధిదారులంతా ఇళ్లు నిర్మించుకొనేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ ఏఈ సుబ్బారావు తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సమతావాణి, సచివాలయం సిబ్బంది బొమ్ము శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయవద్దు

సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ



సర్టిఫికెట్ అందజేస్తున్న సబ్ కలెక్టర్

తెనాలి టౌన్: నేటి యువత ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయవద్దని, వ్యాయామానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ తెలిపారు. పట్టణ గాంధీ చౌక్‌లో చందూస్ జిమ్‌లో గురువారం రాత్రి జరిగిన 12వ వార్షికోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిమ్ మేనేజింగ్ డైరెక్టర్ చందు వెంకటేశ్వరరావు సభకు అధ్యక్షత వహించారు. సభలో సబ్ కలెక్టర్ జిమ్ ఆవశ్యకత, ఆరోగ్యంపై ప్రభావం తదితర అంశాల్ని వివరించారు. జిమ్‌లో కొన్ని విభాగాలు అయిన చెస్ట్ ప్రెస్, బ్యాక్ స్క్వాడ్, ఫ్లాంక్ విభాగాల్లో చాంపియన్‌షిప్‌లు సాధించిన మహిళలు, పురుషులకు మెడల్స్, సర్టిఫికెట్లను సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, జేవీఎం హాస్పిటల్ ఎండీ డాక్టర్ జె.కోటి నాగయ్య, అమ్మ హాస్పిటల్ ఎండీ శివప్రసాద్, జిమ్ ఎండీ చందు వెంకటేశ్వరరావు అందజేశారు. కార్యక్రమంలో ప్రసాద్‌బాబు, విజయ్, మస్తాన్, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.